క్లుప్తంగా

క్రిస్టియన్ల నిరసన



నిరసన తెలుపుతున్న పాస్టర్లు

శ్రీకాళహస్తి: ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని శ్రీకాళహస్తి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ క్రైస్తవులు ఏ మతానికీ, ఏ వ్యక్తికీ వ్యతిరేకం కాదని తెలిపారు. కొంతమంది మతోన్మాదులు క్రైస్తవులపై తరచూ దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాజమండ్రి సమీపంలో సేవ చేస్తున్న పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతి తమను తీవ్రంగా కలచి వేసిందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆంబ్రోస్, సుందర్‌రాజు, జీవమణి, రవి డ్యానీ, జోసెఫ్, రఫాయిల్, మణిబాబు, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి లత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకీశ్వర స్వామికి, మరగదాంబికై అమ్మవారికి ఏకకాలంలో విశేష అలంకరణలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

హాస్టళ్ల మరమ్మతు పనుల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్లలో మరమ్మతు పనులను బుధవారం ఈఈ బాలసుబ్రమణ్యం, ఏఈ కుమార్‌తేజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఎస్సీ బాలుర హాస్టల్ మరమ్మతులకు రూ.12.10 లక్షలు, ఎస్సీ బాలిక హాస్టల్ మరమ్మతులకు రూ.9.5 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో హాస్టళ్లలో దెబ్బతిన ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు, శ్లాబ్ పైభాగం, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డన్ మణి, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెట్టు కూడలి వద్ద వెలసిన నల్లగంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టణంలో బహదూరుపేట ప్రాంతంలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు వివిధ వేషధారణల్లో మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా వెయ్యికళ్ల దుత్తలతో అమ్మవారికి మొక్కులు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో నేరాల నియంత్రణ అవుతుందని అర్బన్ సీఐ శరత్ చంద్ర అన్నారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో బుధవారం రాత్రి సీఐ శరత్ చంద్ర సిబ్బందితో కలిసి పల్లెనిద్ర చేశారు. ముందుగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామకృష్ణాపురం నుంచి ఎటువంటి కేసులు స్టేషన్‌కు రాకపోవడం అభినందనీయమన్నారు. ఎవరైనా బయట ఊర్లకు వెళ్లేటప్పుడు తమకు సమాచారం ఇస్తే వారి ఇళ్లకు భద్రత కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల స్థలాన్ని కాపాడండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న జాకీర్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడాలని శ్రీకాళహస్తి పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ జాకీర్ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా కళాశాలకు మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సుమారు 7 ఎకరాలు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. ఆ స్థలం మొత్తం కబ్జాకు గురి కావడం జరిగిందని, వెంటనే కాపాడి కాంపౌండ్ నిర్మించాలని ఎమ్మెల్యేని కోరినట్లు చెప్పారు. కబ్జాదారులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో సుమారు 2000 మంది ఆడపిల్లలు చదువుకుంటున్నారని, వారికి భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి కొట్టుకుపోతున్నారు..

కూటమి ప్రభుత్వం వచ్చాక మట్టి మాఫియా పడగలు విప్పుతోంది. ప్రభుత్వ భూములు కనిపిస్తే కబ్జా.. లేదంటే గ్రావెల్ తవ్వి తరలించి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. మట్టి మాఫియా అధికారులను సైతం నయానో.. భయానో తమ దారికి తెచ్చుకుని దందా సాగిస్తున్నారు. దీంతో అధికారులు సైతం కూటమి నేతలకు తలొగ్గి ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో సహకరిస్తూ ముందుకు పోతున్నారు. తాజాగా వరదయ్యపాళెం మండలంలో శోత్రియ భూములు కనిపిస్తే కూటమి నేతలు రాత్రికి రాత్రే మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు.

మట్టి కోసం తవ్వకాలు జరపడంతో శోత్రియ భూముల్లో ఏర్పడిన గుంతలు



- చిన్నపాండూరు శోత్రియ భూముల్లో తరలిపోతున్న గ్రావెల్ దోపిడీ
- చదునుగా ఉన్న భూములు రాత్రికి రాత్రే గుంతలమయం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- అటు ఆక్రమణలు.. ఇటు గ్రావెల్ మాఫియాతో శోత్రియ భూములకు కరువైన భద్రత



శోత్రియ భూముల్లో ఇష్టారాజ్యంగా గ్రావెల్ కోసం తవ్విన గుంతలు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్నపాండూరు సమీపంలో గల శోత్రియ భూముల్లో రోజురోజుకూ భూఆక్రమణలు.. గ్రావెల్ మాఫియా రాజ్యమేలుతున్నాయి. ఈ రెండు పరిణామాలతో భద్రత కరువవుతోంది. చిన్నపాండూరు పంచాయతీ పరిధిలోని పాదరికుప్పం రెవెన్యూ పరిధిలో గల రెవెన్యూ లెక్కల దాఖలాల్లోని సర్వే నంబర్ 1 నుంచి 84 వరకు 1056 ఎకరాల ఇనాం శోత్రియ భూములు ఉన్నాయి. ఇప్పటికే ఈ భూముల్లో వందలాది ఎకరాల్లో షికారీలు, ఇతర అక్రమార్కులు గుడిసెలు వేసుకుని దర్జాగా ఆక్రమించుకుని ఉన్నారు. అంతేకాక సమీపంలోని కొందరు వందలాది ఎకరాలు ఆక్రమించుకుని దర్జాగా సాగు చేసుకుంటున్నారు. మిగిలిన భూముల్లో ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. ఎక్కడబడితే అక్కడ చదునుగా ఉన్న భూములను సైతం గ్రావెల్ మట్టి కోసం లోడేస్తూ గుంతలమయం చేస్తున్నారు. రాత్రికి రాత్రే జేసీబీ, ఇటాచీ యంత్రాలతో టిప్పర్ లారీలు, ట్రాక్టర్లతో బయటకు తరలిస్తూ కూటమి పేరు చెప్పుకునే చోటామోటా నాయకులు రూ.లక్షలు జేబులు నింపుకుంటున్నారు. అయితే ఇంత జరుగుతున్నా నియంత్రించాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీఆర్ఏలకు పర్యవేక్ష బాధ్యతలు అప్పగించినా ఆ ప్రాంతంలో నామమాత్రంగా వారు విధులు నిర్వహిస్తుండడంతో వారి కూటమి నేతలకు నైవేద్యంలా మారాయి.

ట్రెంచ్ ఏర్పాటులో నిర్లక్ష్యమెందుకు ?

శోత్రియ భూముల్లో అక్రమాల నియంత్రణకు ట్రెంచ్ (కందకాలు) ఏర్పాటుతోనే సాధ్యమని పలువురు చెబుతున్నారు. అయితే ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నారు. ప్రధానంగా 1056 ఎకరాల శోత్రియ భూముల సరిహద్దుల చుట్టూ లోతైన ట్రెంచ్ ఏర్పాటుతో అటు గ్రావెల్ అక్రమ రవాణా, ఇటు అక్రమార్కుల భూఆక్రమణను పూర్తిగా నియంత్రించవచ్చు. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం ఆలోచన చేసి ట్రెంచ్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్ద పెద్ద గుంతలు..

చిన్నపాండూరు సమీపంలోని శోత్రియ భూములు రాత్రికి రాత్రే గ్రావెల్ అక్రమ రవాణాతో గుంతలమయం అవుతున్నాయి. అటు శ్రీసిటీ ఇటు ఏపీఐఐసీ పరిధిలోని హీరో, అపోలో పరిశ్రమలు ఏర్పాటు కావడంతో శోత్రియ భూములకు ఒక్కసారిగా విలువ పెరిగిపోయింది. దీంతో అందరి చూపు ఆ భూములపైనే పడింది. ప్రధానంగా సత్యవేడు–చిన్నపాండూరు ప్రధాన రోడ్డు మార్గానికి ఆనుకుని వీకే ఆర్‌వై గిరిజన కాలనీ కూడలి సమీపంలో రోడ్డుకు ఆనుకుని చదునుగా ఉన్న భూములను సైతం గ్రావెల్ కోసం అక్రమార్కులు తవ్వకాలు జరిపేస్తున్నారు. ఎంతో విలువైన భూములను గ్రావెల్ మట్టి కోసం తవ్వకాలు జరపడం ఏమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు. పరిశ్రమలు రావాల్సిన భూముల్లో గ్రావెల్ మాఫియా తవ్వకాలు జరపడమేమిటని ప్రశ్నిస్తున్నారు.



చిన్నపాండూరు సమీపంలో చదరంగా ఉన్న శోత్రియ భూములు

ముక్కంటి ఆలయానికి భారీ ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయానికి భారీ ఆదాయం ఒనగూరింది. బుధవారం ఆలయ హుండీ కానుకలను లెక్కించగా రూ.2,58,89,511 వచ్చింది. ఆలయ ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 132 గ్రాములు, వెండి 714.300 కిలోలు, విదేశీ కరెన్సీ 193 వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిష్కారం చూపండి



మాట్లాడుతున్న సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం ఎండీపుత్తూరు గ్రామంలో పూడి నూతన రైల్వేలైనుకు సంబంధించి పంట పొలాల్లోని బోర్లు, బావులు కలిగిన రైతులకు పరిహారం విషయంలో న్యాయం చేయాలని సర్పంచ్ కందాటి మోహనప్రియ కోరారు. బుధవారం గ్రామంలోని పొలాల్లో రైల్వే లైనుకు సంబంధించి జరిగిన సర్వే అధికారులను కలిసి ఆమె మాట్లాడారు. వ్యవసాయం కోసం ఎన్నో బోర్లు వేయగా చివరకు నీరు వస్తున్న బోర్ల మీద రైల్వే లైను వెళ్తే రైతుల జీవనాధారం ఎలాగని ప్రశ్నించారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి రైతుల సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని సర్వే అధికారులు ఆమెకు తెలిపారు.

చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు



కాళంగి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరాజు, ఈఈ మదనగోపాల్

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధి చేయాల్సిన సాగునీటి చెరువుల వివరాలతో పాటు నిధుల మంజూరు కోసం ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరాజు ఆదేశించారు. బుధవారం ఆయన అధికారులతో కలసి చెరువులను పరిశీలించారు. సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం మండలంలో గల ఆరె చెరువు, ఓళ్లూరులోని రాయల చెరువు, కళత్తూరు పెద్దచెరువు రిజర్వాయర్, కాళంగి జలశయాన్ని సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి స్థానిక ఆయకట్టు రైతులు, అధికారులతో చర్చించారు. నిధులు మంజూరయ్యేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని తెలిపారు. ప్రధానంగా కాళంగి రిజర్వాయర్‌కు గేట్ల మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ శాఖ శ్రీకాళహస్తి డివిజన్ ఈఈలు మదనగోపాల్, శివారెడ్డి, డీఈ రత్నాకర్ రెడ్డి ఉన్నారు.

నల్లగంగమ్మకు సారె సమర్పణ





సారె అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహుదూర్ పేటలో వెలసిన నల్లగంగమ్మ అమ్మవారికి జాతర సందర్భంగా శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు సారె సమర్పించారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కంట ఉదయ్ కుమార్, శ్రీకాళహస్తి ఆలయ మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు మున్నా రాయల్, శ్రీవారి సురేష్, డాక్టర్ శంకర్, పత్తిమణి, మొగరాల గణేష్, వల్లం గోపి, రాజా, నవీన్, ప్రసాద్, ఈశ్వర్ సాయి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ కార్యకర్తకు నివాళి



శ్రీవాణి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అంగన్‌వాడీ సీఐటీయూ నాయకులు

సత్యవేడు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పిచ్చాటూరు పరిధిలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త శ్రీవాణికి సత్యవేడు సీఐటీయూ నేతలు నివాళులు అర్పించారు. బుధవారం సత్యవేడు ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రమేష్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కలసి మృతి చెందిన శ్రీవాణి చిత్రపటం ఏర్పాటు చేశారు. అనంతరం వారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా అంగన్‌వాడీ కార్యకర్త శ్రీవాణి మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. శ్రీవాణి మృతి సీఐటీయూ యూనియన్‌కు తీరని లోటు అన్నారు. సత్యవేడు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దారి తప్పిన అడవి జంతువు



హల్‌చల్ చేస్తున్న కొండముచ్చు

నాగలాపురం: ఓ అటవీ జంతువు సమీప అడవిలో నుంచి తప్పిపోయి జనావాసంలోకి వచ్చింది. తిరుమల అటవీ ప్రాంతంలో ఎక్కువగా కనిపించే ఈ రకం కొండముచ్చు బుధవారం నాగలాపురంలో కనిపించడం గమనార్హం. అయితే అది ఎటుపోవాలో దిక్కుతోచక అయోమయంగా వీధుల్లో సంచరిస్తోంది. దుకాణాదారులపై, ద్విచక్రవాహనదారుల మీదకు ఎగబడుతోంది. దీంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులు వెంటనే కొండముచ్చును అడవిలోకి వదలాలని స్థానికులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వ వైఖరిని ఎండగడదాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు మణినాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కూటమి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కొతననేని మణినాయుడు తెలిపారు. ఆయన బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని పార్టీ ఆఫీసులో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలంతా ఐకమత్యంగా పని చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై గ్రామస్థాయి నుంచే పోరాటం చేద్దామని తెలిపారు. కార్యకర్తలకు సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, గురునాథం, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, నాయకులు గురవయ్య, గిరి, ప్రసాద్‌పాల్, జయచంద్రనాయుడు, రమేష్, వెంకటేష్, వెంకటకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు తోడుగా నిలవండి



మాజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పఠాన్

శ్రీకాళహస్తి: మైనార్టీల సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం విజయవాడలో తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిశారు. తనకు పదవి ఇచ్చినందుకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

దుకాణాల వేలం



పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ ప్రభు రెడ్డి

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురం మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పంచాయతీ ఆదాయ వనరులైన వారపు సంత, ప్రైవేటు బస్టాండ్ (ఏపీఎస్‌ఆర్టీసీ) మినహా, జంతు వధశాల గదులను సర్పంచ్ చిన్నదొరై సుధా అధ్యక్షతన, తిరుపతి డీఎల్పీఓ ప్రభు రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ దినసరి కూరగాయలు మార్కెట్ రూ.1,27,000, ప్రైవేటు బస్టాండ్ రూ.1,57,000, జంతు వధశాల రూ.47 వేలు మొత్తం 37 దుకాణాలు కలిపి సంవత్సరానికి రూ.12,10,800 పంచాయతీకి ఆదాయం సమకూరిందన్నారు. 2025 ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి వరకు షాపులు నిర్వహణకు వేలం నిర్వహించినట్లు చెప్పారు. స్థానికులు, వ్యాపారులు డిపాజిట్లు చెల్లించి, సాల్వెన్సీ సర్టిఫికెట్లు పొంది వేలంలో పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, ఉప సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానం నేరం

శ్రీకాళహస్తి: బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి అన్నారు. పట్టణంలోని ఇసుకదిబ్బ ప్రాంతంలో సీఐ గోపి సిబ్బందితో కలిసి పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా బహిరంగ మద్యపానం చేస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం ఆర్.మల్లవరం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం తిరుపతి టు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆఫ్ సీఎం, సీఎస్, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ లిటరసీ, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించారు. 8, 9వ తరగతి విద్యార్థులకు చర్చలు, పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య, హెడ్ ప్రొఫెసర్ అంజన్ బాబు, ప్రొఫెసర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ యశ్వంత్ కుమార్, డాక్టర్ మల్లికార్జున, ఆకాంక్ష స్వచ్ఛంద సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్థాల రవిబాబు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేసుకుందాం

వరదయ్యపాళెం: అధికారుల సహకారంతో కేవీబీపురం మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. బుధవారం కేవీబీపురం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభేదాలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.

పోక్సో చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి: పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్‌జడ్జి బేబీ రాణి అన్నారు. హైకోర్టు, 12వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు ఈరోజు న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని దీ–స్కూల్‌లో గౌరవనీయులైన శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి ఆధ్వర్యంలో పోక్సో చట్టం, బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోక్సో యాక్ట్–2012 గురించి అవగాహన కలిగి ఉండాలని, అలాగే ఇది చిన్నారులకు రక్షణ కల్పించే చట్టం అని తెలిపారు. ఈ చట్టం కింద అత్యాచారం, దౌర్జన్యం, స్త్రీ హక్కులకు భంగం కలిగించడం, అసహజ నేరం, నేరాలు చేయడానికి ప్రయత్నించడం వంటి వాటికి కూడా వర్తిస్తుందన్నారు. అలాగే పిల్లలపై జరుగుతున్న ఆకృత్యాలను అడ్డుకోవడం కోసం చట్టాన్ని రూపొందించిందన్నారు. వికృత చేష్టలతో పిల్లలు జీవించే హక్కును హరించిన వారికి ఈ చట్టం కఠినంగా శిక్షిస్తుందని తెలిపారు. శారీరక, మానసికంగా వారిని వేధిస్తే నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఇలాంటి చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా మీకు ఏదైనా సమస్య ఉంటే అర్జీ రూపంలో ఇస్తే మీకు ఉచితంగానే సేవ అందిస్తారని, అదేవిధంగా టోల్ ఫ్రీ నంబర్ 15100 ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

భూకబ్జాదారులకు కొమ్ముకాస్తారా ?

- ఇంటి పట్టాల కోసం రోడ్డుపైనే వంటావార్పు



రోడ్డుపైనే వంటావార్పులో చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని 15 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఇంటి పట్టాల కోసం రిలే నిరాహార దీక్ష చేస్తున్న దళితులతో కలసి వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 252, 253, 254లో గల ప్రభుత్వ భూమిలో దళితులకు పట్టాలు ఇవ్వాలన్నారు. స్థానికేతరుడైన డాక్టరు బత్తెయ్యనాయుడు 1.75 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. గ్రామంలోని పలువురు దళితులు ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నామని, బత్తెయ్యనాయుడు భూఆక్రమణను అడ్డుకున్న 10 మంది దళితులపై అక్రమ కేసులు పెట్టడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. అధికారులు భూకబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. తక్షణమే దళితులపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులకు ఒక్కొక్కరికి 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని, పట్టాలు ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు స్థానికేతరులకు అమ్ముడుపోయి, పేదలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కత్తి రవి, మండల కార్యదర్శి కత్తిధర్మయ్య, దళితులు పాల్గొన్నారు.

విద్యార్థినులు మనోధైర్యంతో ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం డీఎస్పీ శ్రీనివాసరావు విద్యార్థినులకు సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ, ఉమెన్స్ సేఫ్టీ, శక్తి యాప్‌లపై డిజిటల్ స్క్రీన్‌పై వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థినులు ఆపద సమయంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్ పరిచయాలు అనర్థాలకు తావిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. సీఐ శరత్ చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.